క్లుప్తంగా

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

సదుం: పులిచెర్ల ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ మల్లీశ్వరి మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. సదుం మండలం దొడ్డివారిపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో సహాయకురాలు (బీసీ–ఏ), రొంపిచర్ల మండలం బోడిపాటివారిపల్లె కేంద్రంలో సహాయకురాలు (ఓసీ–జనరల్) పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆమె చెప్పారు. అర్హులైన వారు దరఖాస్తులను ఈనెల 22వ తేదీలోపు సీడీపీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు.

14న మండల సమావేశం

పుంగనూరు: మండల సాధారణ సమావేశం ఈనెల 14న మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ లీలామాధవి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ అక్కిసాని భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగే సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, జెడ్పీటీసీ, అన్నిశాఖల అధికారులు తప్పక హాజరుకావాలని ఆమె కోరారు.

ఏపీఎఫ్ఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకోండి



నమోదును పరిశీలిస్తున్న రఖీబా

పెద్దపంజాణి: మండలంలోని రైతులందరూ ఆంధ్రప్రదేశ్ ఫార్మర్ రిజిస్ట్రీ(ఏపీఎఫ్ఆర్) పోర్టల్‌లో తమ పేర్లను నమోదు చేసుకుని ప్రత్యేక గుర్తింపు సంఖ్య (డిజిటల్ యూనిక్ ఐడీ)ని పొందాలని వ్యవసాయాధికారి రఖీబా తెలిపారు. మంగళవారం మండలంలోని బెరపల్లి గ్రామంలో జరుగుతున్న నమోదు కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ రైతులు స్వయంగా వచ్చి ఆధార్ ఈకేవైసీ ద్వారా పోర్టల్‌లో పేరు నమోదు చేసుకుని ఈ నెలాఖరులోగా ప్రత్యేక గుర్తింపు సంఖ్య పొందాలని సూచించారు.

హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు

గంగవరం: మండలంలోని తమ్మిరెడ్డిపల్లి–76(ఓసీ), జీడిమాకులపల్లి–54(బీసీ–ఏ) అంగన్‌వాడీ కేంద్రాల్లో హెల్పర్ పోస్టులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీఓ ఇందిరప్రియదర్శిని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. నేటి నుంచి ఈనెల 22వ తేదీ సాయంత్రం 5గంటల వరకూ అర్హుల నుంచి దరఖాస్తులు తీసుకుంటామని పేర్కొన్నారు. పలమనేరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయంలో దరఖాస్తులు ఇవ్వాలని తెలిపారు.

ఆప్టా క్యాలెండర్ల ఆవిష్కరణ



క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న ఎంఈఓలు, సంఘ నేతలు

పలమనేరు: పట్టణంలోని ఎమ్మార్సీ వద్ద ఎంఈఓలు లీలారాణి, బాలసుందరం ఆప్టా క్యాలెండర్లను మంగళవారం ఆవిష్కరించారు. ఇందులో ఆప్టా నేతలు అన్సర్, మునాఫ్‌తో పాటు పలువురు ఉర్దూ టీచర్లు పాల్గొన్నారు.

వివాహితపై లైంగికదాడికి యత్నం

బైరెడ్డిపల్లి: బైరెడ్డిపల్లె ఎస్సీ కాలనీలో ఓ వివాహితపై యువకుడు లైంగిక దాడికి యత్నించిన సంఘటన మంగళవారం మధ్యాహ్నం చోటు చేసుకుంది. ఎస్సీ కాలనీకి చెందిన శ్రీరామప్ప కుమారుడు నాగరాజు ఓ వివాహిత ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో వెళ్లి లైంగికదాడికి యత్నించాడు. వివాహిత కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు గుమిగూడేలోపు పారిపోయాడని బైరెడ్డిపల్లె పోలీసులకు వివాహిత ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు.

హైవే పనుల్లో వ్యక్తి మృతి



హరీష్‌చందర్ పాండే మృతదేహం

పలమనేరు: పట్టణ సమీపంలోని గంటావూరు వద్ద జరుగుతున్న ఎక్స్‌ప్రెస్ హైవే పనులు చేస్తున్న ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హరీష్ చందర్ పాండే(50) మంగళవారం మృతి చెందాడు. ఆ పనుల వద్ద ఏం జరిగిందో తెలీదుగానీ ఆయన్ను అక్కడున్న వారు స్థానిక ఆస్పత్రికి తరలించారు. అప్పటికే అతను మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు. దీనిపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు.

నేడు అర్ధగిరిలో పౌర్ణమి వేడుకలు

తవణంపల్లి: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అర్ధగిరి శ్రీ వీరాంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తామని ఆలయ ఈఓ హనుమంతురావు తెలిపారు. ఆలయంలో స్వామి వారికి ఉభయదారులతో అభిషేకం, అర్చనలు, ప్రత్యేక పూజల అనంతరం 11.30 గంటలకు సుదర్శన హోమం, రాత్రి 7.30 గంటలకు ప్రాకారోత్సవం నిర్వహించనున్నట్టు తెలియజేశారు.

అటకెక్కిన మాస్టర్ ప్లాన్

- పరిధి పెంచిన మ్యాప్ సిద్ధం
- ముసాయిదా మాస్టర్ ప్లాన్–2041పై ప్రకటన
- గత ప్రభుత్వంలోనే అభ్యంతరాలు, సూచనల స్వీకరణ
- కూటమి ప్రభుత్వం వచ్చాక అతీగతీ లేని వైనం!



పలమనేరు పట్టణ వ్యూ

పలమనేరు: అమృత్ పథకంలో పట్టణాల అభివృద్ధి కార్యక్రమంలో భాగంగా పలమనేరు పట్టణ పరిధిని పెంచి భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు ఎస్ ఆధారిత ముసాయిదా మాస్టర్ ప్లాన్‌ను గత వైఎస్సార్‌సీపీ పాలనలో చేశారు. ప్రతిపాదిత భూ వినియోగ పటంపై 2023 అక్టోబర్ 18 దాకా సలహాలు– సూచనలు, అభ్యంతరాలను పలమనేరు మున్సిపల్ కార్యాలయంలో స్వీకరించారు. అప్పట్లోనే ఇందుకు సంబంధించి పలమనేరు, కుప్పం, మదనపల్లె పట్టణాభివృద్ధి సంస్థ (పీకేఎంయూడీఏ) ఫామ్–1 నోటీసును జారీ చేసింది. పట్టణాభివృద్ధికి అవసరమైన అన్ని పారామీటర్ల ఆధారంగా ముసాయిదా స్కెచ్‌ను రూపొందించారు. మళ్లీ దీని గురించి ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అతీగతీ లేకుండాపోయింది.

ప్రస్తుత మున్సిపల్ భూ వినియోగమిలా...

మొత్తం పట్టణ వినియోగం 4,670 హెక్టార్లుగా ఉంది. ఇందులో మేజర్‌గా 311 హెక్టార్లలో నివాసాలు, 27 హెక్టార్లలో వ్యాపార సముదాయాలు, 46 హెక్టార్లలో పరిశ్రమలు, మిగిలిన విస్తీర్ణంలో పంట పొలాలు, ఖాళీ స్థలాలు.. ఇతరత్రా ఉన్నాయి. పట్టణానికి తూర్పున ఆంజనేయస్వామి ఆలయం, పడమర క్యాటిల్‌ఫామ్ వంతెన, ఉత్తరం గంగవరం మండల సరిహద్దు దక్షిణాన ఫైర్ కేంద్రంగా హద్దులున్నాయి.

గతంలో ప్రతిపాదించిన మ్యాప్ ఇలా...


ప్రతిపాదించిన మ్యాప్ మేరకు హద్దులు ఇలా ఉన్నాయి. తూర్పున గాంధీనగర్‌కు వెళ్లే రోడ్డు, అడవి, పడమర మొరం పంచాయతీ రంగినాయునిపల్లె, నక్కపల్లె (పార్టు) ఉత్తరాన గంగవరం బైపాస్, దక్షిణాన పెంగరగుంట(పార్టు)గా రూపొందించారు. దీంతో పలమనేరు మండలంలోని టి.వడ్డూరు, బేరుపల్లి, మర్రిమాకులపల్లె, పెంగరగుంట, కోతిగుట్ట, జంగాలపల్లె సమీపంలోని కొండిన్య నది వరకు, రామాపురం, రంగినాయనిపల్లె, సి.కురప్పల్లె గంగవరం మండలంలోని జీడిమాకులపల్లె పార్టు దాకా విస్తీర్ణం పెంచారు. ముసాయిదా పటంలో ప్రతిపాదిత మున్సిపల్, గ్రామ, రెవెన్యూ హద్దులను చూపారు. ఈ పరిధిలోని కొండలు, అడవులు, జాతీయ, రాష్ట్ర, ఆర్‌అండ్‌బీ, గ్రామీణ రహదారులను అందులో గుర్తించారు. ఇంతటితో ఈ కార్యక్రమం ఆగింది. ఇక ఈ ప్రభుత్వంలో పలమనేరు మున్సిపల్ పరిధి పెరగాలని పట్టణవాసులు బలంగా కోరుకుంటున్నారు. దీంతో స్థానిక మున్సిపాలిటీ ఆర్థికంగా బలోపేతం కావడంతో పాటు భవిష్యత్తులో పెద్దపట్టణంగా మారేందుకు అవకాశముంటుంది. దీనిపై పాలకులు, అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టణ ప్రస్తుతం మ్యాప్



పలమనేరుకు సంబంధించిన వివరాలు

పట్టణ విస్తీర్ణం :	17.76 చ.కిలోమీటర్లు
2010 జనాభా లెక్కల మేరకు పట్టణ జనాభా :	51,163
ప్రస్తుత పట్టణ జనాభా :	74 వేలు
మున్సిపాలిటీలో వార్డులు :	26



పెంగరగుంటవైపు మ్యాప్, గంగవరం వైపు మ్యాప్

పాఠశాలల తనిఖీ



ఆమినిగుంటలో అంగన్‌వాడీ కేంద్రంలో స్పెషలాఫీసర్

చౌడేపల్లె: ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, వసతి గృహాలను మండల స్పెషలాఫీసర్ నరేంద్రకుమార్ మంగళవారం తనిఖీ చేశారు. ఆమినిగుంట, గడ్డంవారిపల్లె, తెల్లనీళ్లపల్లెలోని పాఠశాలలను తనిఖీ చేశారు. విద్యార్థుల బోధన సామర్థ్యాన్ని ఆరా తీశారు. వసతి సౌకర్యాలు, మధ్యాహ్న భోజన మెనూను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో పౌష్టికాహారం పంపిణీ, అందిస్తున్న సేవలు, వ్యాక్సినేషన్‌పై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వాస్పత్రులను సందర్శించారు. వసతి గృహాలను పరిశీలించారు. ఎంపీడీఓ లీలామాధవి, ఎంఈఓ కేశవరెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ చందన, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రమాదేవి పాల్గొన్నారు.

సోలార్ పవర్ ప్లాంట్‌కు స్థల పరిశీలన

చౌడేపల్లె: సోలార్ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు మండలంలోని దిగువపల్లె పంచాయతీ షికారిపాళ్యం సమీపంలో సోమవారం స్థల పరిశీలన చేశారు. తహసీల్దార్ హనుమంతు నాయక్, ట్రాన్స్‌కో ఏఈ శశిధర్, సబ్ ఇంజినీర్ సంతోష్ కుమార్, సర్వేయర్ గుణశేఖర్ పాల్గొన్నారు.

నిధులు ఎందుకు ఖర్చు చేయలేదు?



ఎంపీడీఓతో సమీక్షిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

– ఎంపీడీఓపై జెడ్పీ చెర్మన్ ఫైర్

పలమనేరు: పార్టీలు వస్తుంటాయి పోతుంటాయి కానీ ప్రజలకు అవసరమైన సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులుగా మీపై ఉంటుంది. మండలంలో తాగునీటి సమస్య కోసం ఇచ్చిన నిధులను ఎందుకు ఖర్చు చేయలేదని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు ఎంపీడీఓ ఖాదర్‌బాషాను ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన తాగునీటి సమస్యపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ గతంలో మండలంలో అభివృద్ధి పనుల కోసం జెడ్పీ నిధులు రూ.50లక్షలు ఇచ్చినా ఆ పనులు ఎందుకు మొదలు పెట్టలేదని ప్రశ్నించారు. అందుకు స్థానిక రాజకీయ కారణాలున్నాయని అంటున్నారని చెబుతున్నారని తెలిసిందన్నారు. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం కోసం మొరంలో రెండు, కొలమాసనపల్లి, సముద్రపల్లిల్లో బోరు మోటార్ల కోసం జెడ్పీ నుంచి అందిన నిధులను ఎందుకు ఖర్చు పెట్టడం లేదని ఎంపీడీఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇందుకు ఎంపీడీఓ బదులు ఇవ్వకపోవడం గమనార్హం. ఇప్పటికైనా మండలంలో తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని గట్టిగా హెచ్చరించారు. ఎంపీపీ రోజా, సర్పంచుల సంఘ అధ్యక్షుడు విశ్వనాథరెడ్డి, నేతలు చెంగారెడ్డి, రాజారెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కుప్పం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

కుప్పంరూరల్: హైదరాబాద్‌లో శాంసంగ్ సంస్థ నిర్వహించిన అన్వేషణ–2025 పోటీల్లో కుప్పం ఇంజినీరింగ్ విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు కళాశాల చైర్మన్ బీసీ నాగరాజు తెలిపారు. పోటీల్లో బ్లేడ్‌టెక్ ఇన్నోవేషన్ అనే అంశానికి కళాశాలకు చెందిన అబ్దుల్ తోహిద్, ఎం.అరుణ్‌లకు రూ.15 వేల నగదు పురస్కారం లభించినట్లు చెప్పారు. అదేవిధంగా ప్రత్యేక ప్రోత్సాహం కింద వేస్ట్ వర్త్ అంశాన్ని ప్రదర్శించిన విద్యార్థులు పావన, శోభకు రూ.5 వేలు ప్రోత్సాహం లభించినట్లు ఆయన చెప్పారు. వీరు ఈనెల 18న జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు ఆయన పేర్కొన్నారు. మంగళవారం ప్రోత్సాహాలు సాధించిన విద్యార్థులను అభినందించారు. వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, సెక్రటరీ సాగర్‌రాజ్, ప్రిన్సిపల్ సుధాకర్‌బాబు, పీఆర్వో ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఊసేలేని ఉద్యానవన శాఖ అధికారులు



వ్యాధి సోకిన టమాట పంట

–తీవ్రంగా నష్టపోతున్న రైతులు

గుడుపల్లె: గ్రామాల్లో రైతులు చేసిన పంటలకు అవగాహన కల్పించాల్సిన ఉద్యానవనశాఖ అధికారులు ఊసేలేక పోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. మండలంలోని 18 గ్రామ సచివాలయాలకు సంబంధించిన ఉద్యానశాఖ అధికారులు కుప్పంలోనే మకాం వేయడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలో 70 శాతం మంది రైతులు ఉద్యాన పంటలపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నారు. ఎక్కువగా టమాట, కూరగాయలు, పువ్వులు పంటలు పండిస్తారు. కానీ ఎండలు ఎక్కువగా ఉండడంతో ఉద్యాన పంటలకు కొత్త కొత్త వ్యాధులు వచ్చి పంటలు తీవ్రంగా నష్టపోతుందన్నారు. పంటలు పండించిన దానికి సకాలంలో మందులు పిచికారీ చేయకపోవడంతో రైతులు చేసిన పంటలను పురుగులకు, వ్యాధులు సోకి తీవ్రంగా నష్టపోవడంతో అప్పుల పాలవుతున్నారు. ఏ కాలానికి ఏ మందులు వాడాలో గ్రామాల్లో అవగాహన కల్పించేందుకు అధికారులు కరువయ్యారు. చేసిన పంటలకు మందులు కావాలంటే కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు వెళ్లి తీసుకొచ్చి పిచికారీ చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఉద్యానవన శాఖ అధికారు లు గ్రామాల్లో పర్యటించి పంటలపై అవగాహన కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

కాన్పులు ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే చేసుకోండి



రొంపిచెర్ల పీహెచ్‌సీలో వైద్యపరీక్షలు

రొంపిచెర్ల: ప్రభుత్వ ఆస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవాలని డాక్టర్ దినేష్‌కుమార్‌నాయక్ అన్నారు. మంగళవారం రొంపిచెర్ల పీహెచ్‌సీలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. సీహెచ్‌ఓ కాంతమ్మ, మండల ఆరోగ్య విద్యాధికారి రాజేశ్వరి, సూపర్‌వైజర్ పంకజ, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి

గంగవరం: ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య తప్పనిసరి అని వ్యవసాయాధికారి హేమలత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం నుంచి పొందిన విశిష్ట సంఖ్య పథకాలకు లింక్ చేయడం వల్ల రైతులకు అన్ని ప్రభుత్వ పథకాలు అందుతాయని పేర్కొన్నారు. ఈనెల చివరి వరకూ గడువు ఉంటుందని భూమి కలిగిన ప్రతి రైతు తప్పకుండా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని తెలిపారు.

శివలింగాన్ని తాకిన సూర్య కిరణాలు



రొంపిచెర్ల కట్ట కింద శివాలయంలో శివలింగంపై పడుతున్న సూర్య కిరణాలు

రొంపిచెర్ల: మహత్యమో, నిర్మాణ నైపుణ్యమో తెలియదుగానీ అక్కడ సూర్యకిరణాలు ఆశ్చర్య పరుస్తున్నాయి. రొంపిచెర్ల మండలంలోని బొమ్మయ్యగారిపల్లె గ్రామ పంచాయతీలోని కట్టకింద శివాలయంలో ఈ సంఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. ఉదయం ఆలయానికి వెళ్లిన భక్తులకు శివలింగంపై సూర్యకిరణాలు పడడం కనిపించింది. మహాశివరాత్రి పండుగ నెల వచ్చిందంటే చాలు శివాలయంలోని గర్భగుడిలో ఉన్న శివలింగంపై సూర్యకిరణాలు పడి శివుని స్పర్శించి భక్తులకు పులకరించిపోయేలా చేస్తున్నాయి. ప్రతి సంవత్సరం ఇక్కడ శివలింగంపై సూర్యకిరణాలు పడుతుంటాయి. భక్తులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేస్తున్నారు.

క్రీడలతో దృఢత్వం,ఉల్లాసం



విజేత విద్యార్థులకు సత్కారం

వి.కోట: క్రీడలతో శారీరక దృఢత్వంతోపాటు విద్యార్థుల్లో మానసిక ఉల్లాసం, ఐకమత్యం భావన పెంపొందుతుందని స్థానిక సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మంగళవారం పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో క్రీడాదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. వివిధ ఆటల పోటీలు నిర్వహించి ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలతో సత్కరించారు. పాఠశాల డీఎస్ వెంకటేష్, ఏజీఎం సురేష్, ప్రిన్సిపల్ ప్రభాకర్ పాల్గొన్నారు.

రుణాల పంపిణీ



మహిళా గ్రూపు సభ్యులకు రుణాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

పలమనేరు: స్థానిక వెలుగు కార్యాలయంలో మంగళవారం మండలంలోని మహిళా గ్రూపులకు రూ.7.5కోట్ల రుణాలను ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పంపిణీ చేశారు. రుణాలతో మహిళలు ఆర్థికంగా పుంజుకోవాలని ఆకాంక్షించారు. సమావేశంలో వెలుగు అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

మంచినీటి సమస్యపై నిర్లక్ష్యం వద్దు

మండలంలో మంచి నీటి సమస్య రాకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం ఆయన మంచినీటి సమస్యపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఎంపీడీఓ ఖాదర్‌బాషా, తహసీల్దార్ ఇన్బునాథన్, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

గజవాహనంపై వేణుగోపాలుడి చిద్విలాసం



గజవాహనంపై ఊరేగుతున్న వేణుగోపాలుడు

వి.కోట: పట్టణంలోని రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా 6వ రోజైన మంగళవారం స్వామివారు గజవాహనంపై పట్టణ పురవీధుల్లో విహరించి భక్తులను కటాక్షించారు. ఉదయం ఆలయ అర్చకులు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి ఉత్సవ మూర్తులను అలంకరించి పట్టణంలో ఊరేగించారు. రాత్రి స్వామి వారిని గజవాహనంపై కొలువుదీర్చి పట్టణ పురవీధుల్లో వైభవంగా ఊరేగించారు. అడుగడుగునా భక్తులు స్వామి వారికి హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. నేడు బుధవారం బ్రహ్మోత్సవాల్లో అత్యంత ప్రధానమైన రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త తెలిపారు.

గర్భిణులు వైద్యపరీక్షలు చేసుకోవాలి





సదుం: పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ గిరీషా, బైరెడ్డిపల్లె: మాట్లాడుతున్న డాక్టర్ విజయ్‌చంద్ర

సదుం: గర్భిణులు తరచూ వైద్యపరీక్షలు చేసుకోవాలని చెరుకువారిపల్లె పీహెచ్‌సీ డాక్టర్ గిరీషా సూచించారు. స్థానిక ఆస్పత్రిలో పీఎం సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 50 మంది గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సిబ్బంది శిఖామణి, విమల, రుక్మిణి, గీత పాల్గొన్నారు.

గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ

బైరెడ్డిపల్లె: మహతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బైరెడ్డిపల్లె పీహెచ్‌సీలో ఆవరణలో మంగళవారం గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. బైరెడ్డిపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి విజయ్‌చంద్ర మాట్లాడుతూ తాజా ఆకుకూరలు, పండ్లు, గుడ్లు వంటి విటమిన్‌తో కూడిన ఆహార పదార్థాలను గర్భిణులు తినాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లోనే కాన్పులు చేసుకోవడం శ్రేయస్కరమన్నారు. ఆరోగ్యసిబ్బంది, మహతి ఫౌండేషన్ నిర్వాహకులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు

పుంగనూరు: వేసవి తీవ్రమవుతున్న తరుణంలో ప్రతిఒక్కరూ అగ్నిప్రమాదాలపై అవగాహన కలిగి ఉండాలని ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు సూచించారు. మంగళవారం మండలంలోని అడవినాథునికుంట మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపల్ డాక్టర్ రమ ఆధ్వర్యంలో విద్యార్థులకు అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సుబ్బరాజు మాట్లాడుతూ ఎలాంటి ప్రమాదాలు జరిగినా వెంటనే అగ్నిమాపకశాఖకు సమాచారం అందించాలన్నారు. ఈసందర్భంగా వివిధ అగ్నిప్రమాదాలపై నిర్వహించే విన్యాసాలను, వినియోగించే వస్తువులను విద్యార్థులకు చూపి వివరించారు. అగ్నిమాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.